క్లుప్తంగా

పీఎంపీ అసోసియేషన్ ఉంగుటూరు కార్యవర్గం ఎన్నిక



ఉంగుటూరులో నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు మండల పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం ఉంగుటూరులో నిర్వహించిన సమావేశంలో పూర్వ కార్యవర్గాన్ని తిరిగి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొచ్చర్లకోట శ్రీనివాస రావు, ఉపాధ్యక్షుడిగా కాలిమంగన్న, కార్యదర్శిగా బీఎస్‌బీ రాజు, సహాయ కార్యదర్శిగా రేవాడి మురళీకృష్ణ, కోశాధికారిగా పీవీ రాఘవరావులు ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే జగమేశ్వరులు, జిల్లా కార్యదర్శి ఎం. జయరాం, ఈ సమావేశంలో పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

హెచ్‌ఎంగా మనోహర్ బాధ్యతల స్వీకరణ

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం మనోహర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పీడీ నుంచి హెచ్‌ఎంగా పదోన్నతి వచ్చిన నేపథ్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ కోటే నాగ మల్లీశ్వరీకుమార్, పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మాసగిరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సత్కరించారు.

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సిద్ధం



డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారి సుబ్బారావు, సర్పంచ్ కోటే నాగ మల్లీశ్వరీ కుమార్

దెందులూరు: ప్రతి నియోజకవర్గానికి ఒక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మిస్తున్న నేపథ్యంలో దెందులూరు నియోజవకర్గంలో గోపన్నపాలెంలో ల్యాబ్‌ను నిర్మించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, గోపన్నపాలెం సర్పంచ్ నాగ మల్లీశ్వరీ కుమార్, ఏఈవో గద్దే రమేష్, అధికారులు ల్యాబ్‌ను పరిశీలించారు. ఏడీ సుబ్బారావు మాట్లాడుతూ రూ.65 లక్షలతో ల్యాబ్ నిర్మాణం పూర్తయిందని శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరెంకి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

శాకంబరీ దేవి అలంకరణలో పెద్దింటమ్మ

దెందులూరు: దెందులూరులోని ప్రాచీన విశిష్టత గల పెద్దింటమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారిని ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో శాకంబరీ దేవిగా అలంకరించారు. 18 రకాల కూరగాయలు, ఆకుకూరలతో 5 గంటల పాటు శ్రమించి అమ్మవారిని అలంకరించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు.

తల్లాపురంలో నేడు 'గడపగడపకు'

ఉంగుటూరు: తల్లాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. అన్ని శాఖల అధికార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

దెందులూరు: సమస్యలను పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి, దెందులూరు మండల ప్రత్యేకాధికారి కృపావరం అన్నారు. శుక్రవారం గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగ మల్లీశ్వరీ కుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ కోటే నాగమల్లీశ్వరీ కుమార్ హాజరై మాట్లాడారు. ఎంపీడీవో ఏపీపీ లక్ష్మీ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరెంకి సత్యనారాయణ, ఎంపీటీసీలు సువ్వా ప్రభుదాసు, ఏనుగు అంజలి ప్రసాద్, ఉప సర్పంచ్ తోట పద్మారావు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు ఉన్నారు.

నేడు వైఎస్సార్ జయంత్యుత్సవాలు

నిడమర్రు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శనివారం మండల వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ సంకు సత్య కుమార్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు బువ్వనపల్లిలో నిర్వహించే వైఎస్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు.

పేదలకు వరం జగనన్న సురక్ష పథకం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత



పూళ్లలో అర్హులైనవారికి ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: జగనన్న సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం కాకర్లమూడి, బొమ్మిడిలో జగనన్న సురక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని వారిని గుర్తించి జగనన్న సురక్ష ద్వారా వారు లబ్ధి పొందే అవకాశం కలిగిందని అన్నారు. ఈ దిశగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు సహకరించాలని అన్నారు. గడిచిన నాలుగేళ్లలో పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం సీఎం జగన్ అవిరళ కృషి చేస్తున్నారని అన్నారు. పరిపాలన వ్యవస్థల్లో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను గమనించాలని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. తెలుగుదేశం, జనసేన, వంటి పార్టీల నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి మీ ముందుకు వస్తారని అవేవీ నమ్మవద్దని అన్నారు. మరో తొమ్మిది నెలల్లో రానున్న ఎన్నికలలో మరో మారు వైఎస్ జగన్‌ను సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జగనన్న సురక్ష ద్వారా ఇంటింటికీ వలంటీర్లు, అధికారులు తిరిగి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల వివరాలు నమోదు చేశారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లును వాసుబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ, వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు, ఎంపీపీ గంట శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, మేడవరపు మోహన్, ఈవోపీఆర్డీ షంషుద్దీన్, ఆయాగ్రామాల వైసీపీ నాయకులు కూనా రాజు, వర్రింకల బుజ్జి, ఎంపీడీవో ఆంజనేయులు, ఆయాగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొబ్బరి మెక్కలు నాటారు.

సంక్షేమ పథకాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్

భీమడోలు: దేశంలోని ప్రతి రాష్ట్రం ఏపీ వైపు చూసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల కల్యాణ మండపంలో శుక్రవారం జగనన్న సురక్ష పథకం బహిరంగ సభ సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వాసుబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అర్హత ఉండి ఏ పథకం రానటువంటి వారు ఉండరాదన్న ఏకైక లక్ష్యంతో జగనన్న సురక్ష పథకం తీసుకువచ్చారని అన్నారు. అనంతరం గ్రామంలోని 626 ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే వాసుబాబు చేతుల మీదుగా పంపిణీ చేసారు. పూళ్ల పీహెచ్‌సీలో 100 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పి.విజయరాజు, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీటీసీ గొండు కృష్ణ చైతన్య, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, కోడూరుపాడు సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, గ్రామ పార్టీ అధ్యక్షుడు పుప్పాల రామ్మోహనరావు, గ్రామ కార్యదర్శి సూర్య, ఈవోఆర్‌డీ ముత్తయ్య, సచివాలయ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త గ్రామాల సృష్టికర్త సీఎం వైఎస్ జగన్



కొవ్వలి జగనన్న కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజలకు దేవుడిగా ఆరోగ్యశ్రీతో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తే ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గృహ నిర్మాణ పథకం ద్వారా కొత్త గ్రామాలను నిర్మిస్తున్నారని, పేదలకు శాశ్వత ఆశ్రయం కల్పించారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం రాత్రి కొవ్వలిలో దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లా వీరాస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత జగనన్న కాలనీలో లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. థాంక్యూ సీఎం సర్ అంటూ నినాదాలు చేశారు. జగనన్న సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇప్పటికే విద్యుత్, తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటు చేశామన్నారు. పూర్తిస్థాయిలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని ఆయన అన్నారు. లబ్ధిదారులకు అందిన పథకాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల ఉద్యోగులు, ఇతర గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు నోటిఫికేషన్

భీమడోలు: భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 9 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు ధరఖాస్తులను స్వీకరిస్తున్నామని భీమడోలు ప్రాజెక్టు పీవో కేవీ విజయలక్ష్మి శుక్రవారం అన్నారు. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో 9 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. భీమడోలు మండలంలోని భీమడోలు వెలంపేట బీసీ,డీ కేటగిరికి, ఈతకోట వారి వీధిలో ఓసీ, ఆగడాలలంక ఎస్సీ కాలనీలో ఎస్సీ, దుద్దేపూడిలో బీసీ,ఏ, ఉంగుటూరు 3లో ఓసీ, కైకరంలో ఓసీ దివ్యాంగురాలికి, సీతారామపురంలో ఓసీ, నిడమర్రు మండలంలో తోకలపల్లి 3లో బీసీ,ఈ, పెదనింద్రకొలను- 4లో ఓసీ కేటగిరికి రిజర్వ్ చేసినట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళలు ఈనెల 1వ తేదీ నాటికి 21 ఏళ్లు నిండి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. పదో తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. వికలాంగులకు, అంగవైకల్యం కలిగిన వారికి ప్రాధాన్యతనిస్తామన్నారు. ఈనెల 15వ తేదీ సాయంత్రానికి భీమడోలులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి దరఖాస్తు దారులు నేరుగా అందజేయాలన్నారు. విద్యార్హతలు, నివాసం, కులం, పుట్టిన తేదీ, వికలాంగత్వం, వితంతు ధ్రువీకరణ పత్రాలను విధిగా సమర్పించాలని ఆమె పేర్కొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరకాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉంగుటూరు-3, కైకరం, సీతారామపురం, తోకలపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోపు దరకాస్తులు అందజేయాలని తెలిపారు. ఆయా అర్హతల ఆధారంగా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

వెలమ సామాజిక వర్గానికి సమున్నత స్థానం



జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను సన్మానిస్తున్న ఎంపీ కోటగిరి, ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వెలమ సామాజిక వర్గానికి ఎన్నడూ లేని విధంగా సముచిత స్థానంతో రాజ్యాధికారం కల్పిస్తున్నారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం పత్తేపురంలో కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావుకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి జగన్ ప్రభుత్వం వచ్చే వరకూ జిల్లాలో, రాష్ట్రంలో వెలమలకు రాజ్యాధికార పదవుల్లో సముచిత స్థానం ఏ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. తొలిసారి జగనన్న ప్రభుత్వంలో వెలమలకు అన్ని పదవుల్లోనూ సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలోని వెలమ సోదరులందరూ ఐక్యంగా ముఖ్యమంత్రిగా తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరినీ సీఎం వైఎస్ జగన్ తప్పనిసరిగా గుర్తిస్తారన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును కొప్పుల వెలమ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ కోడే కాశి, వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ ఎంపీటీసీ వెంకటలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మరడా రంగారావు, వెలమ సంఘం తరుపున చొక్కాకుల లక్ష్మీనరసింహ వరప్రసాద్, రాంప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలి



యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తున్న వ్యవసాయ ఏడీఏ, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ, ఏవోలు

భీమడోలు: మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తారని భీమడోలు వ్యవసాయ శాఖ ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి అన్నారు. భీమడోలులో శుక్రవారం వ్యవసాధికారుల బృందం ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. సార్వా సీజన్‌లో రైతులు పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. రైతులు అనుమానాలను నివృత్తి చేసారు. నారుమడి వేసుకునే ముందుగా రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలని, సూడోమోనాస్‌తోనే విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. లేనిచో నారుకట్టలను సూడోమోనాస్‌లో ముంచి నాటు కోవాలన్నారు. నాట్లు వేసే సమయంలో నారుమడి కొనలను తుంచి వేయడం ద్వారా ఆకుముడత తెగుళ్ల దరికి చేరవన్నారు. నాట్లు వేసేటప్పుడు చదరపు మీటర్‌కు 33 మొనలు ఉండేలా చూసుకోవాలన్నారు. సూడోమోనాస్‌ను పశువుల పేడతో కలిసి 24 గంటల పాటు ఉంచి పొలంలో చల్లుకోవాలన్నారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలోని పొలం గట్లపై కందులను నాటితో రైతులకు అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. అనంతరం రైతులకు కంది విత్తనాలు, వేపమానె, సూడోమోనాస్‌ను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం ఏడీఏలు శిరీషా, సుధా, ఏవో కాశీమాత, మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ ఎస్‌పీవీ ఉషారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు ప్రయత్నం



పెదపాడు మండలంలోని వట్లూరులో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటాపద్మశ్రీ

పెదపాడు: ఎన్నికలు సమీపించడంతో ప్రజలను మోసగించేందుకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని నూటికి నూరుశాతం పథకాలు అర్హులకు అందించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ వివరించారు. పెదపాడు మండలంలోని వట్లూరు గ్రామ శివారు సీతారామపురం గ్రామసచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చైర్ పర్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయని వివరించారు. ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పనిచేయడం గర్వకారణంగా ఉందని చెప్పారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి మాట్లాడుతూ పార్టీకి అండగా నిలిచిన సీతారామపురం ప్రజలను తాను ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి ఏ పూర్ణ చంద్రరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసు రాజు, మండల గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేపి గోపీ, వట్లూరు సర్పంచ్ జీ రత్నకుమారి, ఉపసర్పంచ్ చింతా మధుసూధనరావు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, వట్లూరు పంచాయతీ కార్యదర్శి మేకా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ దళాల ఆయుధ భద్రతపై నిఘా



భీమడోలులో నూతన ఎస్పీ డాక్టర్ కేఎస్ రావును సత్కరిస్తున్న ఏఎస్సై పి.శ్రీనివాస్, సిబ్బంది

భీమడోలు: ప్రత్యేక పోలీస్ దళాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్‌పీఎఫ్ రాజమండ్రి జోన్ ఎస్పీ, కామన్డెంట్ డాక్టర్ కేఎస్ రావు అన్నారు. భీమడోలు సమీపంలోని (బాంబుల దిబ్బ) ఓఎన్‌జీసీ మేగజైన్ పోస్ట్ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మిక సందర్శన చేసారు. ఎస్పీ బాధ్య తలు చేపట్టిన తొలిసారిగా వచ్చిన ఆయనకు ప్రత్యేక పోలీస్ దళాల అధికారులు, కానిస్టేబుల్స్ ఘన స్వాగతం పలికారు. వారి నుంచి ఆయన గౌరవ వందన స్వీకరించారు. మేగజైన్ పోస్ట్‌లోని అయుధాలు, గన్స్, ఇతర ఆయుధ సామగ్రిని ఆయన పరిశీలించి సంబంధిత అధికారులు తగు సూచనలందించారు. వాటి భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను ఏఎస్సై పి.శ్రీనివాసు, సిబ్బంది దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన సీఐ ఎస్.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం



సీసీ రోడ్డు డ్రెయిన్లకు సంబంధించి పనులకు శంకుస్థాపన చేసి శిలఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు: అన్ని రంగాల్లోనూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శుక్రవారం పెదవేగి మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కవ్వగుంటలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శంకుస్థాపన చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, అంకన్నగూడెం సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్మడు, ఎంపీటీసీ పిల్లి రామకృష్ణ, కవ్వగుంట సర్పంచ్ మద్దాల వాణి, మాజీ సర్పంచ్‌లు పామర్తి వీరయ్య, మద్దాల నాగయ్య, పార్టీ నాయకులు నిమ్మల సుబ్బారావు, నిమ్మల సత్తిబాబు, పసుపులేటి రాజేష్, అరేపల్లి రత్నాకరరావు, గొడుగు కిరణ్, మద్దాల పండు, ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

హోలీల్యాండ్‌లో ప్రత్యేక ప్రార్థనలు



హోలీల్యాండ్‌లో ప్రత్యేక దివ్యబలిపూజ అర్పిస్తున్న మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు

దెందులూరు : ఇటలీ దేశం నుంచి భారతదేశానికి వచ్చి సామాన్య జీవనం గడిపి పేదలకు మరువలేని సేవలందించిన ఫాదర్ సిల్వియో పాస్క్వలి పేరు పునీతుల పుటల్లో లిఖితమైందని ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు పేర్కొన్నారు. శుక్రవారం పెదవేగి మండలం పినకడిమి పవిత్రభూమిలో సీఎస్‌ఏ సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ సిల్వియో పాస్క్వలి 99వ వర్ధంతిని ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఎస్‌ఏ సభ అసిస్టెంట్ మదర్ జనరల్ సిస్టర్ అల్ఫోన్సా, గుంటూరు ప్రోవిన్షియల్ సిస్టర్ శౌరీల ఆధ్వర్యంలో హోలీల్యాండ్ సుపీరియర్ సిస్టర్ ఇన్నాసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఫాదర్లు, సిస్టర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా మోస్ట్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు హాజరై ప్రత్యేక దివ్యబలిపూజ అర్పించారు. కార్యక్రమంలో ఫాదర్ బాల, దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, వైస్ చాన్సలర్ ఫాదర్ బాబుజార్జ్, విచారణ గురువులు పాల్గొన్నారు.

నేడు దివంగత సీఎం వైఎస్సార్ జయంతి

భీమడోలు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీ శనివారం ప్రతి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించాలని, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని వారు కోరారు. గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

గడువు తీరిన వస్తువులు విక్రయిస్తే కేసు

దెందులూరు : దుకాణాల్లో విక్రయించే ప్రతి వస్తువుపై తయారీ తేదీతోపాటు ముంగిపు గడువు తేదీని ఖచ్చితంగా ముద్రించాలని, గడువుతీరిన వస్తువులను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తూనికలు, శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ హెచ్చరించారు. పెదవేగిలో కోడిమాంసం, కిరాణా, కొలతల ఎరువులు దుకాణాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు.